


ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి – తణుకు రూరల్

కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తుందని, దీనిలో భాగంగానే ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తణుకులో శనివారం సిఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆయన స్థానిక ఎంఎల్ఎ రాధాకృష్ణతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత ఎలా పాటిస్తారో, పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సారూ.. పట్టించుకోరూ..!



- ఆక్వా రైతుల ఇబ్బందులు తీవ్రతరం
- పరిశ్రమల కాలుష్యంపై చర్యలేవీ
- డెల్టా ఆధునీకరణ పూర్తి చేసేదెప్పుడో
- కొల్లేరు సమస్యకు పరిష్కారం ఎప్పుడు
- రెగ్యులేటర్ల నిర్మాణంపై తాత్సారం
- పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటి?
- నేడు తణుకులో సిఎం పర్యటన



జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో సభాస్థలి వద్ద ఏర్పాట్లు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పది నెలలు గడుస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రైతులు, ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంపై ఇప్పటికీ కదలిక లేకుండాపోయింది. శనివారం సిఎం తణుకు పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. జిల్లాలోని సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజానీకం కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారు. రెండు జిల్లాల్లో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. ఆక్వా సాగులో లక్షన్నర ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం తెస్తున్న సాగులో ఆక్వా ఒకటి. ప్రస్తుతం ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆక్వా మేతలు, మందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. ఎకరా రొయ్యల సాగుకు రూ.ఐదు నుంచి రూ.ఆరు లక్షల వరకూ ఖర్చవుతోంది. ధర స్థిరంగా లేకపోవడంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. వంద కౌంట్ ధర కిలో రూ.290 నుంచి అమాంతంగా రూ.230కు పడిపోయింది. దీంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి. పదెకరాలు దాటితే విద్యుత్ సబ్సిడీ సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలని కొన్నిరోజులుగా ఆక్వా రైతులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని సిఎంను ఆక్వా రైతులు కోరుతున్నారు.

పరిశ్రమల కాలుష్యంతో తీవ్ర సమస్యలు..
డెల్టా ఆధునికీరణ పూర్తి చేసేదెప్పుడో

తణుకు నుంచి భీమవరం వరకూ ఉన్న దాదాపు 21 పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు 2014–19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో తేల్చారు. పరిశ్రమల కాలుష్యం అరికట్టేందుకు అప్పట్లో కార్మికశాఖ మంత్రిగా ఉన్న పితాని సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు భీమవరంలో ప్రత్యేక సమావేశం సైతం నిర్వహించారు. యనమదుర్రు డ్రెయిన్ను ప్రక్షాళిస్తామని చెప్పారు. ఆక్వా, ఇతర పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం పంట కాలువల్లోకి చేరి తాగేందుకు గుక్కెడు నీళ్లు లేకుండాపోయాయి. కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు సైతం జనాలను చుట్టుముడుతున్నాయి. టిడిపి కూటమి అధికారంలోకొచ్చి పది నెలలు గడుస్తున్నా కాలుష్యంపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. పరిశ్రమల కాలుష్యంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

గోదావరి డెల్టా పరిధిలో 5.29 లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో కాలువలు మెరకదేరిపోవడం, షట్టర్లు వంటివి పాడైపోవడం జరిగింది. దీంతో చిన్నపాటి వర్షాలకు సైతం రైతులు వేలాది ఎకరాల్లో పంటను కోల్పోతున్నారు. గడిచిన ఖరీఫ్‌లోనూ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది సైతం ఇప్పటి వరకూ డెల్టా ఆధునికీకరణకు సంబంధించి టెండర్లు పిలవలేదు. ఇరిగేషన్ అధికారులు రెండు జిల్లాల్లో దాదాపు రూ.450 కోట్లకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆమోదం తెలిపి పనులు సాగించాలని రైతులు కోరుతున్నారు. కోకో పంటకు సరైన ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెస్తామని చెప్పినా ఇప్పటికీ జరగలేదు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

కొల్లేరు సమస్యకు పరిష్కారం ఎప్పుడు?

కొల్లేరు ప్రాంతంలో దాదాపు 120కుపైగా గ్రామాలు ఉండగా ఐదు లక్షలకుపైగా జనాభా ఉన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని గత టిడిపి పాలనలో అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సుప్రీంకోర్టు తీర్పు పేరుతో ప్రస్తుతం కొల్లేరులోని చేపల చెరువులకు అటవీ శాఖాధికారులు గండ్లు కొడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి. అంతేకాకుండా 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో రైతులకు చెందిన 14 వేల ఎకరాల జిరాయితీ భూముల్లో చెరువులను సైతం గండ్లు కొట్టేసిన పరిస్థితి ఉంది. జిరాయతీ, ప్రభుత్వం ఇచ్చిన సొసైటీ భూములను తమకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. కొల్లేరు సరిహద్దులను తేల్చడంతోపాటు, మూడో కాంటూరుకు కుదించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం కొల్లేరు సమస్యను ఎప్పటికి పరిష్కరిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొల్లేరులోకి సముద్రపు నీరు ఎగదన్ని తీవ్ర నష్టం జరుగుతోంది. దుంపగడప, మొల్లపర్రు, తడిపాక వద్ద మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.450 కోట్లు కేటాయించింది. పనులు మాత్రం ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పోలవరం నిర్వాసితుల పరిస్థితి ఏమిటి?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరావాస ప్యాకేజీ అందని పరిస్థితి. గత ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు ఇస్తామని చెప్పింది. కూటమి ప్రభుత్వం మాత్రం ఇటీవల రూ.6.25 లక్షల చొప్పున మాత్రమే ప్యాకేజీ సొమ్ము జమ చేసింది. 2006లో సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పినా ఇవ్వని పరిస్థితి. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం విషయంలో కోతలు పెట్టింది. భూమికి భూమి ఇంకా పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. కాలనీల నిర్మాణం పూర్తి చేయలేదు. జులై, ఆగస్టులో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 21 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వర్షాకాలం వచ్చేసరికి నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందజేసి ఖాళీ చేయించాల్సి ఉంది. ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు కాంటూరుతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేస్తుందా, లేదా అనే ప్రశ్న అందరినీ వెంటాడుతోంది.

నేడు సిఎం పర్యటన సాగేదిలా..

ప్రజాశక్తి – తణుకు

ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకు పర్యటనకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఆయన శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణానికి విచ్చేయనున్నారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అనే స్లోగన్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. హెలీకాప్టర్‌లో చంద్రబాబు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు తణుకు ఎస్ఎంవిఎం పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడ స్వాగతం అనంతరం 8.21 నుండి 8.30 వరకు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలతో సమావేశమవుతారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల నుండి రోడ్డు మార్గంలో 8.35కి పట్టణంలోని ఎన్‌టిఆర్ పార్కుకు చేరుకుని 9.10 వరకు పారిశుధ్య కార్మికులతో మాట్లాడతారు. 9.15కి జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలకు చేరుకుని 10.15 వరకు ప్రజావేదిక నిర్వహిస్తారు. 10.15కి జూబ్లీ రోడ్డులోని నూలి వారి లేఅవుట్‌కు చేరుకుని 11.20 వరకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో, 11.20 నుండి 11.50 వరకు జిల్లా అధికారులతో సమావేశమవుతారు. 12 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 12.10కి హెలీకాప్టర్‌లో ఉండవల్లి బయల్దేరి వెళ్తారు.



భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు నేతలు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

జిల్లాలో సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి – భీమవరం

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలని, త్యాగాలతో నిర్మించుకున్న ఫ్యాక్టరీని కొనసాగించాలని సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా స్థానికంగా చేపట్టిన ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. ఎన్నో త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించే యత్నాలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరుపై కూటమి ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రయివేటీకరణ విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ధర్నాలో సిఐటియు నాయకులు డి.నాగేశ్వరరావు, డి.త్రిమూర్తులు, చిన్న, శివ, సూరిబాబు, స్వామి పాల్గొన్నారు.

తణుకు: విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి విశాఖ ఉక్కు అమ్మేయడం లేదా ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ పరిశ్రమ కోసం 32 మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విశాఖ ఉక్కుకు గనులు ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గుబ్బల గోపీ, నేతలు పిఎల్.నర్సింహారావు, గోవిందరావు, ఆచంట శ్రీరామ్మూర్తి, జి.వెంకటేశ్వరరావు, కిషోర్, రమణ, వి.తరుణ్ తేజ్, శ్రీహర్ష, పి.రాజా పాల్గొన్నారు.



తణుకులో..



యలమంచిలిలో..

యలమంచిలి: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చించినాడ కలగంపూడి, ఏనుగువానిలంక, బాడవ తదితర గ్రామాల్లో ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నాయకులు ఎన్నికల ముందు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుని తీరతామని చెప్పారని, అధికారంలోకొచ్చాక ఏమీ మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను కూటమి సర్కార్ అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కానేటి బాలరాజు, బాతిరెడ్డి జార్జి, సరిపల్లి జయప్రద, పొత్తూరి జ్యోతి, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముస్కూడి జయశ్రీ, చెట్టిమి నాగమణి, చంటి, వెంకటస్వామి, వాసు పాల్గొన్నారు.

కాలనీల్లో వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం



ఉండి : సైకిల్‌యాత్ర బందానికి వినతిపత్రం అందజేస్తున్న జగనన్న కాలనీవాసులు

ముగిసిన సిపిఎం ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి – ఉండి

గత ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో గత వైసిపి, నేటి టిడిపి ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. శుక్రవారం ఉండి మండలం మహదేవపట్నం చేరుకున్న సైకిల్‌యాత్ర బృందానికి సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఆర్‌పి అగ్రహారం, ఉండి జగనన్న కాలనీల్లో యాత్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే అధికంగా సంక్షేమ పథకాలు అందిస్తానని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో ప్రజలకు మొండిచెయ్యి చూపుతోందని విమర్శించారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఉండి మెయిన్ రోడ్‌లోని పాలకేంద్రం వద్ద ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పిన నాటి తహశీల్దార్ నాయకులతో కుమ్మక్కై 222 మంది లబ్ధిదారులను మోసగించి వెలివర్రు గరువులో ఇళ్ల నిర్మాణానికి పనికిరాని స్థలాలను కేటాయించారని మండిపడ్డారు. ఉండి జగనన్న కాలనీలో సుమారు 653 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వగా మౌలిక వసతులు కల్పించకపోవడంతో కేవలం 50 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని, వారికి ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారానికోసారి మంచినీటి ట్యాంకర్ వస్తుందని, ఇలాగైతే వారు గొంతు తడుపుకునేదెలాగని ప్రశ్నించారు. రేషన్ వ్యాన్ కాలనీకి రాకపోవడంతో వ్యాన్ ఎక్కడుందో తెలుసుకుని అక్కడ పడిగాపులు పడుతున్నామని, గ్యాస్ కోసం కూడా ఈ తిప్పలు తప్పడం లేదని పలువురు నేతల వద్ద వాపోయారు. దీనిపై యాత్ర బృందానికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మండల విస్తరణాధికారి చల్లా వెంకట సుదర్శన్ రెడ్డికి ఫోన్ చేసి సమస్యలు వివరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరిస్తామని మండల విస్తరణాధికారి హామీ ఇచ్చారని గోపాలన్ తెలిపారు. ఈ నెల 17న కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో కాలనీల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సైకిల్ యాత్రలో నేతలు వై.రాము, బురిడి వాసుదేవరావు, కె.క్రాంతిబాబు, ఎం.వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఆంజనేయులు, గొర్ల రామకృష్ణ, ధనికొండ శ్రీనివాస్, కొట్టాడ వెంకటేశ్వరరావు, చీర్ల శ్రీనివాస్, రామకూరి వెంకటరత్నం పాల్గొన్నారు.



ఆకివీడులో శుక్రవారం రాత్రి ముగిసిన సైకిల్‌యాత్ర

కాళ్ల: సిపిఎం ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర శుక్రవారం కాళ్ల మండలంలోకి ప్రవేశించింది. కాళ్ల, కాళ్లకూరు, జువ్వలపాలెం గ్రామాల మీదుగా ఆకివీడు మండలానికి పయనమైంది. కాళ్లలంక కాలనీ స్థానికులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బృందానికి అందజేశారు. కాళ్లకూరులో వెంకటాపురం కాలనీలో నేతలకు స్థానికులు విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు విఫలమయ్యారన్నారు. కాళ్ల జగనన్న కాలనీలో సుమారు 122 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వగా మౌలికవసతులు కల్పించకపోవడంతో కేవలం 50 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నారన్నారు. నిర్మించుకున్న వారు సైతం సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో దూసి కళ్యాణి, ఇంజేటి శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, నేతలు మండా సూరిబాబు, ఎం.ఆంజనేయులు, బత్తుల విజయకుమార్, తిరుమాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకివీడు: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన మహాధర్నాకు ప్రతిఒక్కరూ తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. బడ్జెట్లో పేదల కాలనీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య జిల్లాస్థాయి సైకిల్ యాత్ర శుక్రవారం రాత్రి మండలానికి చేరింది. తాళ్లకోడు కాలనీకి చేరిన ఈ సైకిల్ యాత్రకు కాలనీవాసులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఒక న్యాయం, పెద్దలంకు ఒక న్యాయంగా వ్యవహరించడం సరికాదన్నారు. పేదలకు కనీస సదుపాయాలు కల్పించే వరకూ ఎర్రజెండా తోడుగా ఉంటుందన్నారు. తొలుత కాలనీవాసులు తమ సమస్యలను బృందానికి వివరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నేతలకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు, నాయకులు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయ కుమారి, బివి.వర్మ, బి.కళ్యాణి, బి.రాంబాబు, జి.ధనుష్, కాలనీవాసులు గొల్ల రాజారత్నం, పెన్నాబత్తుల నాగు, పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.



కాళ్లలో..



ఆకివీడులో ఘనస్వాగతం

పేదోడిపై ప్రతాపం.. పెద్దోళ్లపై ప్రేమా..!

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు తీరుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి – ఉండి

పేదోడిపై ప్రతాపం.. పెద్దోళ్లపై ప్రేమ కురిపిస్తున్న ఉండి ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు పారిశ్రామికవేత్త రంగరాజు ఆక్రమణలు కనపడట్లేదా అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రశ్నించారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో సైకిల్ యాత్రలో భాగంగా బిసి కాలనీ ప్రజలు రంగరాజు ఆక్రమణలను సైకిల్ యాత్ర బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బురిడి వాసుదేవరావు మాట్లాడుతూ 1987లో ఏర్పడిన ఈ కాలనీ నుంచి జాతీయ రహదారికి వెళ్లేందుకు 60 అడుగుల మార్గం కేటాయించారని, అయితే ఎనిమిది అడుగుల మార్గమే ఉందని, మిగిలిన స్థలాన్ని పారిశ్రామికవేత్త రంగరాజు ఆక్రమించి షెడ్డు నిర్మించారన్నారు. అధికారులు కూడా రంగరాజు జోలికెళ్లడం లేదన్నారు. వెళ్లకుండా ఉన్నారని మండిపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ నిరుపేదలు, చిరు వ్యాపారులు ఆక్రమించిన భూములు మాత్రమే రఘురామకృష్ణంరాజుకు కన్పిస్తాయా, పారిశ్రామికవేత్త రంగరాజు ఆక్రమించిన భూములు కన్పించడం లేదా అని విమర్శించారు. అభివృద్ధి పేరిట రఘురామకృష్ణంరాజు కేవలం నిరుపేదలపై బుల్డోజర్ ప్రయోగిస్తున్నారని, బడాబాబులపై ప్రేమ ఒలకపోస్తున్నారని అన్నారు. గణపవరం రోడ్డులో ఉన్న రొయ్య ఒలుపు కేంద్రాల వారు యథేచ్ఛగా డ్రెయినేజీ భూములు ఆక్రమించినా వారి జోలికెళ్లకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. వై.రాము మాట్లాడుతూ నిరుపేదలకు, చిరు వ్యాపారులకు అండగా నిలిచే ఏకైక జెండా సిపిఎం అని అన్నారు. రఘురామకృష్ణంరాజు తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, నేతలు పాల్గొన్నారు.

ప్రయాణం.. విషాదాంతం..!

గూడెం వద్ద లారీని ఢీకొన్న కారు
ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
మరొకరికి తీవ్ర గాయాలు
మండపేటలో పెను విషాదం

ప్రజాశక్తి – మండపేట, తాడేపల్లిగూడెం

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలోని రావులపేటకు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనతో మండపేట పట్టణంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారి పనులు చేస్తున్న వాహనాన్ని తణుకు వైపు వస్తున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మండపేట పట్టణానికి చెందిన భోగిళ్ల పాపారావు కుమారుడు భోగిళ్ల వెంకట సత్యసురేన్, భార్య నవ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల కుమార్తె వాసవీ కృష్ణ (4)ను తీవ్ర గాయాలతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. సమీప బంధువు ఉప్పులూరి శ్రీరమ్య పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సురేన్ కుటుంబం హైదరాబాద్ నుండి మండపేట కారులో వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.



కారులో మృతదేహాలు

లారీ ఓనర్స్ ఉమ్మడి రాష్ట్ర అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్, కీర్తిశేషులు భోగిళ్ల విశ్వనాథం ఇంట తీవ్ర విషాదం నెలకొంది. విశ్వనాథం కుమారుడు భోగిళ్ల పాపారావు కుమారుడు, కోడలు, మనవరాలు ఈ ప్రమాదంలో మృతి చెందారు. విశ్వనాథం అల్లుడు పాలచర్ల బాబ్జీ తన భార్య, కుమార్తె ఉప్పులూరి రమ్యతో కలిసి ఇటీవలే అమెరికా నుండి హైదరాబాద్ వచ్చారు. తన మేనత్త కుమార్తె రమ్యను సురేన్ తన కుటుంబంతో కలిసి మండపేట తీసుకొస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

74 గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు

నియోజకవర్గ ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తాం
డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి – పాలకోడేరు

ఉండి నియోజకవర్గ ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, దీనిలో భాగంగా 74 గ్రామాల్లో మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. పాలకోడేరులో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీతో ఐదు రూపాయల కాయిన్ వేస్తే 20 లీటర్ల నీటిని అందించడం అద్భుతంగా ఉందన్నారు. జూన్ నెలాఖరుకు నియోజకవర్గంలోని 74 గ్రామాల్లో కేంద్ర బ్యాంక్, పంచాయతీ, స్నేహితులు, ఎంపీ ల్యాండ్స్ నిధులతో మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఒక ఉద్యమం మాదిరిగా తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలాగే అన్ని తాగునీటి చెరువులు నింపేలా చర్యలు తీసుకున్నామన్నారు. జూన్ నాటికి కాలువల ప్రక్షాళన పనులు చేపడతామన్నారు. రొయ్యలు, చేపల చెరువుల నీటి వల్ల జలాలు కలుషితమవుతున్నాయని, అవసరమైతే సంబంధిత చెరువుల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ నదరాజు మురళీకృష్ణంరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, టిడిపి ముఖ్యనాయకులు కొత్తపల్లి నాగరాజు, ఏడుకొండల రాజు, కమ్మిలి రాంబాబు, పాల వెంకట చలపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు


వైద్యులను సత్కరిస్తున్న వీరవాసరం కళాపరిషత్

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యంలో భీమవరం మిత్ర మెడికేర్ హాస్పిటల్ వారిచే శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కళా పరిషత్ సాహితీ కళా సేవలతో పాటు పేదలకు వైద్య సేవలు అందించాలనే ఆశయంతో పనిచేస్తోందని కళాపరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కర్రా ప్రశాంత్ మాట్లాడుతూ తాను పుట్టిన ఊరిలో వైద్య సేవలు అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కాకులపాటి శ్రీవర్ధన్ మాట్లాడుతూ ఎముకలు గట్టితనానికి మంచి పోషకాహారాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మద్దాల శివాజీ, గ్రంధి కిషోర్, జడ్డు పెద్దయ్య, గోపా సురేష్, గుండా గోపాలం, గునిశెట్టి ప్రసాద్, గిల్లి సుబ్బారావు, పంజా సాయిబాబు, కళాపరిషత్ సభ్యులు, డాక్టర్లను సన్మానించారు. క్యాంప్ మేనేజర్ బి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి - గణపవరం

భూ వివాదాల పరిష్కారానికి, సరిహద్దుల ఏర్పాటుకు జరుగుతున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ వైకెవి.అప్పారావు అన్నారు. శుక్రవారం మొయ్యేరులో రీసర్వే పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ శ్రీబాబు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి - కాళ్ల



కోపల్లెలో లూథరన్ మందిరం నిర్మాణానికి విరాళం ఇచ్చేందుకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు ముందుకొచ్చారు. దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సభ్యులు చేతుల మీదుగా చర్చి నిర్వాహకులకు పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా చర్చి నిర్మాణానికి రూ.పది వేల అందజేసిన డాక్టర్ దాట్ల వెంకట రామరాజు కు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యెహాన్, ఇశ్రాయిల్, చర్చి నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో హోలీ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, వల్లూరు, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు జిమ్ముకుంటూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. పాఠశాలకు సెలవు దినం కావడంతో చిన్నారులు నృత్యాలు చేస్తూ రహదారిపై వెళ్లి వచ్చే వారిపై రంగులు రాసి హంగామా చేశారు. చిన్నారులు, యువత ఈ వేడుకల్లో పోటాపోటీగా రంగులు పూసుకుని ఆనందంగా గడిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కలెక్టర్‌కు ఉపసర్పంచి ఫిర్యాదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

నెగ్గిపూడి గ్రామంలోని ఇరిగేషన్ ఆఫీస్, రైతు విశ్రాంతి భవనాల సమీపంలోని ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ పోరంబోకు స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని మార్టేరు గ్రామ ఉప సర్పంచి, వైసిపి నాయకులు కర్రి వేణుబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా, ఇరిగేషన్ ఆఫీస్ పక్కన ఉన్న పొలం ఆసామి ఈ ఆక్రమణకు పాల్పడి చెట్లు నరికి, ట్రాక్టర్‌లో తరలించినా ఎవరూ అడ్డుకోకపోవడం శోచనీయమని వాపోయారు. ఈ విధంగా ప్రభుత్వ పోరంబోకు స్థలాలను ఆక్రమించే వారిని విచారించి, చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

పిఠాపురం తరలిన జనసైనికులు

ప్రజాశక్తి - గణపవరం

జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గణపవరం నుంచి జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక కుమారి థియేటర్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులను జిల్లా సంయుక్త కార్యదర్శి ముత్యాల వాసు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, వీర మహిళలు పిఠాపురం తరలివెళ్లారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల నుంచి జనసైనికులు శుక్రవారం పిఠాపురం తరలి వెళ్లారు. పిఠాపురంలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు గ్రామాల నుండి జనసైనికులు, వీర మహిళలు ప్రత్యేక బస్సులు, కార్లలో తరలివెళ్లారు.

పెనుమంట్ర : జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సెంటర్లలో పార్టీ జెండాను ఆవ్కిరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పిఠాపురంలో జరిగే సభకు తరలి వెళ్లారు.


తాడేపల్లిగూడెం:జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పిఠాపురం వెళ్తున్న జనసేన నాయకులు, వీర మహిళలం జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన యువనాయకుడు బొలిశెట్టి రాజేష్ మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 300 కార్లు, 40 బస్సుల్లో జనసైనికులు జయకేతనం సభకు తరలివెళ్తున్నట్లు తెలిపారు.

పాలకొల్లు : జనసేన 12వ ఆవిర్భావ సభ పిఠాపురంలో ఘనంగా నిర్వహిస్తున్న సందర్భంగా పాలకొల్లు నుంచి పెద్ద ఎత్తున జన సైనికులు శుక్రవారం తరలివెళ్లారు. 12 బస్‌లు, 30 కార్లలో వెళ్లారు. అంతకు ముందు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జనసేన ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

15 రోజుల్లో వర్మీ తయారీకి సిద్ధం : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపిసి) కేంద్రం ద్వారా 15 రోజుల్లో వర్మీ తయారీకి సిద్ధంగా ఉందని ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.రాంప్రసాద్ తెలిపారు. స్థానిక ఎస్‌డబ్ల్యూ పిసి కేంద్రాన్ని సర్పంచి ఇంజేటి మరియమ్మ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి బంగారు గోపితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా తయారవుతున్న వర్మీ, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ విభజన వంటివి పరిశీలించారు. స్థానికంగా పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ చెత్త నుంచి సంపదను తయారు చేసే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పాలకోడేరులోని ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రంలో వర్మీని తయారు చేసే చర్యలు వేగవంతం చేస్తామన్నారు. మరో 15 రోజుల్లో 50 కేజీల వర్మీని అందుబాటులోకి రానుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని నిర్వహించే విధంగా అన్ని చర్యలూ చేపట్టామన్నారు.


వర్మీని పరిశీలిస్తున్న ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి

బండ చాకిరీ..!

పనిభారంతో పంచాయతీ కార్యదర్శుల అవస్థలు

ప్రజాశక్తి - కాళ్ల



గ్రామ సచివాలయం

పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో తలమునక లవుతున్నారు. పనిభారం భరించలేక ఇన్నాళ్లకు మౌనం వీడి ప్రభుత్వంపై గళం విప్పారు. మూడు నెలల నుంచి జిల్లాలో సుమారు 30 మంది గ్రామ కార్యదర్శులు పదవీ విరమణ చేశారు. ఆయా ఖాళీ పోస్టుల బాధ్యలను పక్కనే ఉన్న పంచాయతీ కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. దీంతో జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి అగమ్యగోచరంగా మారంది. తరచూ ఉద్యోగులపై పనిభారం పెరగడంతో పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. సర్వేలు చేసేందుకు మానసికంగా నలిగిపోతున్నారు.

జిల్లాలోని 20 మండలాల్లో 393 గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలో 16 విలీన గ్రామ పంచాయతీలు, 403 గ్రామ సచివాలయాలు ఉన్నాయి.

పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో సమన్వయం, అధికారుల విజిట్లు, పాలకవర్గంతో ఇవికాక ప్రతి పంచాయతీలోనూ ఎన్నో చిన్నా, పెద్ద సమస్యలు ఉన్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు పని భారంతో సతమతమవుతున్నారు. పని ముగించుకుని ఇంటికి బయలుదేరి సమయానికి వీడియో కాన్ఫరెన్స్‌లు, మీటింగ్‌లకు తప్పనిసరిగా హాజరు కాకపోతే మెమోలు జారీ చేస్తారని, ఆదేశాలు ఉండడంతో అర్ధరాత్రి అయినా సరే మీటింగులకు హాజరు కావాల్సిన పరిస్థితి. దీంతో అటు కుటుంబానికి, పిల్లలకు సరైన సమయాన్ని కేటాయించలేక మనోవేదనకు గురవుతున్నారు. పైఅధికారులకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

సర్వేలతో సతమతం..

39 సర్వేలతోపాటు ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒత్తిడితో కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత విధానంలో మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, వర్క్ ఫ్రమ్ హోమ్, హౌస్ హోల్డ్స్ జియో ప్యాకింగ్, పి4 సర్వే, డెత్ వెరిఫికేషన్ సర్వే, పెనిసిఎస్ సర్వే, లెథర్ ఆర్టిసన్స్ సర్వే, ఎన్సిసిఎల్ లింకేజ్ సర్వే, 0-6 సంవత్సరాల పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, ఏపీ రెసిడెంట్స్ సర్వే, విలేజ్ అసిస్టెంట్స్, విలేజ్ ప్రొఫైల్ సర్వే, ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లు, లైసెన్స్ ఫీజ్ వసూలు, లీజ్ వసూలు, వేలం పాటలు పనులు చేయాల్సి ఉంది. అంతేకాకుండా ఎఆర్ వెన్ యాప్ శానిటేషన్ డ్రైవ్ ఎస్‌డబ్ల్యు ఏపీ షెడ్ క్లాస్ మిత్రులతో పని చేయించడం, వర్మీ తయారీ, ప్రతి గురువారమూ సేల్స్, ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర, సచ్ఛాంధ్ర కార్యక్రమాలు, గ్రామసభ సమావేశాలు జరపడం, గ్రామ పంచాయతీ రికార్డుల అప్లికేషన్, సమీక్షా సమావేశాలు తదితర పనులను పంచాయతీ కార్యదర్శులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. తమకు పనిభారం తగ్గించాలని కోరుతున్నారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి..

పాల శారద శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు



గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు అధిక పనిభారం, అధిక పని ఒత్తిడి తగ్గించాలి. 39 సర్వేలతోపాటు ఇతరత్రా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఒత్తిడితో కార్యదర్శులు ఇబ్బందిపడుతున్నారు. సచివాలయానికి వెళ్లిన దగ్గర నుంచి వివిధ రకాల సర్వేలతోనే సాయంత్రం వరకూ సరిపోతోంది. గ్రామంలో వివిధ పనులపై వచ్చిన ప్రజలకు పని చేయలేకపోతున్నాం. ఇప్పటికే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూలు, వ్యర్థాల నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ వంటి విధులు నిర్వహిస్తూ, వీటితో పాటు పి4 సర్వే, సమావేశాలు నిర్వహిస్తున్నాం. దీనివల్ల మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యంతో మరింత ఇబ్బందులు పడుతున్నాం. కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

పాలకొల్లులో డయాలిసిస్ కేంద్రం ప్రారంభం
రాష్ట్రంలో మరిన్ని డయాలిసిస్ కేంద్రాలు
వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - పాలకొల్లు

రానున్న ఐదేళ్లలో వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎపి స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్‌తో కలిసి ఆయన పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. వందపడకల హాస్పిటల్, పాత హాస్పిటల్‌ను పరిశీలించారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. డయాలసిస్ ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై డాక్టర్లతో మాట్లాడారు. డయాలసిస్ పేషంట్లతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో పాలకొల్లులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి సిఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. సరైన వైద్యం అందక ఏ ఒక్కరూ మరణించ కూడదనే కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా, అపర భగీరథుడు మంత్రి నిమ్మల రామానాయుడు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. పాలకొల్లు అభివృద్ధి పనులు రాష్ట్రవ్యాప్తంగా అనుసరణీయమన్నారు. ఈ ఆసుపత్రిని చూస్తుంటే నిరుపేదల ఆశ్రమంగా అద్భుతంగా ఉందన్నారు. ఈ గొప్పతనం రామానాయుడుదే అన్నారు. మా జిల్లాకు నీరు ఇవ్వాలని కోరితే పుష్కలంగా తాగు, సాగునీరు ఇచ్చిన అపర భగీరథుడు రామానాయుడు అన్నారు. ఇప్పటికే కేన్సర్, కిడ్నీ, డయాబెటిస్, హైపర్ టెన్షన్ తదితర సర్వేలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం కాకుండా నిరంతరాయంగా పనిచేయడానికి అవసరమైన వైద్య, టెక్నికల్, తదితర సిబ్బంది, టీమ్‌లు 24 గంటలూ అందుబాటులో ఉంటారని తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించారని తెలిపారు. నేడు కూటమి సర్కారు పునర్జీవం పోసిందని అన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవలకు గాను ప్రయివేటు ఆస్పత్రులకు చెల్లించాల్సిన రూ.2 వేల కోట్ల బకాయిల్లో ఇప్పటికే రూ.1,300 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ ప్రాంతాల ప్రజలకు డయాలసిస్ సేవలతో బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయని తెలిపారు. ఇప్పటివరకూ డయాలసిస్ రోగులు భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి తదితర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. ఇకనుంచి ఇటువంటి అవస్థలు ఉండవు అని తెలిపారు. ఇప్పటికే డయాలసిస్ సేవలు పొందేందుకు 40 మంది రోగులు పేర్లు నమోదు చేసుకున్నారని, భవిష్యత్తులో మరింత పెరిగి డయాలసిస్ సెంటరు ద్వారా వైద్య సేవలు అందబోతున్నాయని మంత్రి రామానాయుడు తెలిపారు. ఎపి స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో ఒకరు, సామాన్య కార్యకర్త నుండి ఒకరు ఇద్దరు నాయకులు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. నిమ్మల రామానాయుడు, సత్య కుమార్‌తో వేదిక పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఇన్‌ఛార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.భానూనాయక్, ఎడిసిహెచ్ పి.సూర్యనారాయణ, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనరు బి.విజయసారథి, హాస్పిటల్ సూపరింటెండెంట్ ఒ.రవికుమార్ పాల్గొన్నారు.


డయాలిసిస్ కేంద్రంను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి సాయి సుధీర్‌రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర



మండలంలోని జుత్తిగ గ్రామ సర్పంచి, వైసిపి నాయకుడు తమనంపూడి వీర్రెడ్డి కుమారుడు టి.సాయిసుధీర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ గ్రూప్-బి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ తణుకు భాష్యంలో, ఇంటర్ శశిలో, ఇంజినీరింగ్ విశాఖపట్నం గాయత్రి విద్యా పరిషత్‌లో చదివిన సుధీర్‌రెడ్డి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ ఈ పరీక్ష రాసి విజయం సాధించినట్టు ప్రజాశక్తికి తెలిపారు. త్వరలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తానని, సివిల్స్ కూడా రాస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డిని పలువురు అభినందించారు.

లబ్ధిదారులు ఇకెవైసి చేయించుకోవాలి

తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్

యలమంచిలి :రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులంతా ఆయా గ్రామాల్లోని చౌక దుకాణాల వద్ద గానీ లేదా ఎండియు వాహనం వద్ద గానీ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ గంధి పవన్‌కుమార్ తెలిపారు, శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులో ఎంతమంది సభ్యులుంటే అంత మందీ తమ ఆధార్ కార్డును లింకు చేయించుకుని వేలిముద్రలను నమోదు చేయించుకోవాలన్నారు. దీనికి చివరి గడువు ఈ నెల 17వ తేదీ వరకూ మాత్రమే ఉందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ నిషేధం మనందరి బాధ్యత

భీమవరం టౌన్:అనారోగ్య సమస్యగా మారుతున్న ప్లాస్టిక్‌ను నిషేధించడం మనందరి బాధ్యత అని హోల్ సేల్ ప్లాస్టిక్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై హోల్ సేల్ ప్లాస్టిక్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సభ్యులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. సభ్యులు కార్తీక్, ప్రవీణ్, బాలాజీ, తాడి కృష్ణ మాట్లాడుతూ భీమవరంలో ఇప్పటికే ప్లాస్టిక్‌ను నిషేధించడం జరిగిందని, రానున్న రోజుల్లో పూర్తిగా నిషేధిస్తారని తెలిపారు. బయోలైట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కఠారి దిలీప్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో హోల్ సేల్ ప్లాస్టిక్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్తదానం

భీమవరం టౌన్:తలసేమియాతో బాధపడుతున్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ కోశాధికారి బోండా సుబ్బారావు, ఇన్నర్ వీల్ క్లబ్ సామంతపూడి మణి అన్నారు. శుక్రవారం భీమవరం ఎఎస్ఆర్ తలసేమియా కేర్ సెంటర్‌లోని నలుగురు వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో రక్తం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లల బాధలు వర్ణతీతమని, అటువంటి వారికి రక్తదానం చేయడం గొప్ప విషయమని తెలిపారు. తలసేమియా వైద్య నిపుణులు డాక్టర్ జి.రామకృష్ణంరాజు, డాక్టర్ రాణిచంద్ర, మెడికల్ ఆఫీసర్ దుర్గారావు మాట్లాడుతూ తలసేమియా పుట్టకతోనే వస్తుందని, రక్తహీనతతోనే ఈ వ్యాధి నడుస్తుందని తెలిపారు. అల్లూరి సూర్యనారాయణ రాజు, చెరుకువాడ రంగసాయి తలసేమియాతో బాధపడుతున్న నలుగురు చిన్నారులకు రక్త మార్పిడి చేయడం జరిగిందని తెలిపారు.

చిట్టవరంలో ఉచిత వైద్య శిబిరం

నరసాపురం:దాతల సాయంతో గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చిట్టవరం గ్రామ సర్పంచి తాడి లక్ష్మణరావు అన్నారు. చిట్టవరంలో శుక్రవారం మాలల ఐక్య వేదిక అధ్యక్షుడు కాకిలేటి ఆనందకుమార్ ఆధ్వర్యంలో విజయవాడ పివిఆర్ మల్టీ స్పెషాలిటీ సహకారంతో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని లక్ష్మణరావు ప్రారంభించారు. శిబిరంలో బిపి, షుగర్, ఎకో స్కాన్ ఇసిజి, టైర్డ్ తదితర పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఘంటసాల

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం యందుకుదురు శివారు జీలగలగండి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. లారీని బొలెరో వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన కోట వరప్రసాద్(50), చీపురుపల్లి శివకష్ణ (29) బొలెరో వాహనంలో చేప పిల్లల లోడ్‌తో చల్లపల్లి వైపు నుంచి బందరు వెళుతున్నారు. అస్సాం నుంచి సరుగు బాదుల లోడుతో లారీ చీరాల వెళుతోంది. ఈక్రమంలో బొలెరో వాహనం జీలగలగండి వద్ద లారీని బలంగా ఢీకొంది. బొలెరో వాహనం నుజ్జునుజ్జయి రోడ్డు కిందకు వెళ్లిపోయింది. ఆ వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో అందులో ఉన్న కోట వరప్రసాద్, చీపురుపల్లి శివకృష్ణ అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న చల్లపల్లి సిఐ ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ ప్రతాపరెడ్డి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికుల సాయంతో అతి కష్టం మీద మృతదేహాలను బయటకు తీసి మార్చురీకి తరలించారు. నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలి

భీమవరం టౌన్:గణితంపై పట్టు సాధించాలని గణిత ఉపాధ్యాయులు పూడి కోటేశ్వరరావు, రేపాక వెంకన్న బాబు అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించి గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణితమంటే భయపడనవసరం లేదన్నారు. శ్రద్ధగా సాధన చేస్తే విద్యార్థులు ఉన్నత శిబిరాలను అధిరోహిస్తారని అన్నారు. ఎం.శ్రీనివాస్‌రావు, జె.శకుంతల మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఒక్క గణితంలో పట్టు సాధిస్తే అన్ని రంగాల్లోనూ రాణించొచ్చని తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహనుండాలి

భీమవరం టౌన్:పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా 18 ఏళ్లలోపు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించేందుకు భీమవరం బిసి గవర్నమెంట్ కాలేజ్ ఉమెన్స్ హాస్టల్‌లో శుక్రవారం న్యాయమూర్తి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి యోహాన్ (న్యూటన్), ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేద్కర్, బి.లోకేశ్వరరావు, జ్యోతి, పారా లీగల్ వాలంటీర్ వి.శ్రీలక్ష్మి మాట్లాడారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సిపిఐ

భీమవరం :ఇళ్లు, ఇళ్ల స్థలాలపై కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో తాడేరులో ఇళ్లులేని నిరు పేదలతో ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్ల స్థలాల అర్జీదారులతో ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, వ్యక్తిగత దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేస్తామని పెద్ద సంఖ్యలో అర్జీదారులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, జిల్లా సమితి సభ్యుడు మల్లుల శ్రీనివాసరావు, ప్రజా నాట్యమండలి నాయకులు ఛాన్ భాషా పాల్గొన్నారు.

దళిత ఉద్యోగులు సంఘటితం కావాలి

భీమవరం టౌన్:ప్రస్తుత పరిస్థితుల్లో దళిత ఉద్యోగులంతా సంఘటితం కావాలని ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.రత్నప్రదీప్ అన్నారు. శుక్రవారం భీమవరం బిఆర్ అంబేద్కర్ భవనంలో ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ, భీమవరం మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.రాజ్ కిషోర్ (తహశీల్దార్), సెక్రటరీగా ఎస్.శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.జ్యోతి, ట్రెజరర్ జి.కృష్ణ మోహన్, మండల అధ్యక్షులుగా వి.రాజేష్ కుమార్, సెక్రటరీగా కె.గౌతమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రాజేష్, ట్రెజరర్ పి.సుదీర్‌బాబు, సభ్యులను ఎన్నుకున్నారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ భవనం వరకూ ర్యాలీ నిర్వహించారు. రత్న ప్రదీప్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ఐక్యంగా ఉండి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంబాబు, జి.మురళీకృష్ణ, కె.శ్రీనివాస్‌రావు, కెసి.రాజు, కోనా జోసెఫ్, గంటా సుందర్ కుమార్, ఎస్.సలీంరాజు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - తణుకు రూరల్

గుత్తికొండ మల్లయ్య, సత్తెమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు రామకృష్ణ, గీతాంజలి నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వేల్పూరులో జరిగిన కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడారు. ఆ దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బళ్ల నాగలక్ష్మి, అంబటి రామకృష్ణ, యండమూరి నాగేంద్ర, విశ్వనాథం సుబ్బారావు, సొరపల్లి రామకృష్ణ, తాడిశెట్టి అజయ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉన్నత శిఖరాలు అందుకుంటారని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ తెలిపారు. స్థానిక సాగి రామకృష్ణంరాజు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం స్పోర్ట్స్ డే జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిశాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాలలో సెంట్రల్ జోన్‌స్థాయి క్రీడా పోటీలు కూడా ఇక్కడే నిర్వహించి క్రీడలకు అధిక ప్రాధాన్యతిస్తున్నట్లు చెప్పారు. తమ కళాశాల క్రీడాకారులు సౌత్ జోన్, జాతీయస్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబర్చడం కళాశాలకే గర్వకారణమన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి యాజమాన్యం తరపున ప్రత్యేక మెమెంటోలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ జగపతిరాజు మాట్లాడారు. కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు రామరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కేంద్ర మంత్రికి డిసి ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేంద్ర మంత్రి, మిత్రులు శ్రీనివాసవర్మను కలిసి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రానికి చెత్తను వారసత్వంగా ఇచ్చిన ఘనత గత చెత్త వైసిపి ప్రభుత్వానిదని రాష్ట్ర స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్ చెప్పారు. పాలకొల్లులో డంపింగ్ యార్డ్‌ను మంత్రి రామానాయుడుతో కలిసి పట్టాభిరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చెత్త మీద పన్ను వేసిన చెత్త ప్రభుత్వం 30 వేల టన్నుల చెత్తని పాలకొల్లు పట్టణంలో వదిలి వెళ్లారని తెలిపారు. అతి త్వరలోనే ఇక్కడున్న 30 టన్నుల చెత్తను క్లియర్ చేసి ఆ భూమిని మంచి పార్క్ గా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు.